సాక్షి
కామారెడ్డి
బుధవారం, 1, మార్చి, 2023



గ్రంథాలయాలపై పట్టింపేది?
లైబ్రరీలలో గ్రంథ పాలకులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయడం లేదు. దీంతో చాలాచోట్ల మూతపడుతున్నాయి.
- 8లో ▸



డిజిటల్ బోధన
ధర్మరావుపేట్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపరిచారు. ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోంది.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /14.9

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

5,407 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగులో భాగంగా మంగళవారం 5,407 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం అయిన 660 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 1,58,500 మందికి కంటి పరీక్షలు చేశామని, 25,666 మందికి కంటి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు.

రుణాలను వినియోగించుకోవాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకంపై మంగళవారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వయం ఉపాధి అవకాశాలు, రుణ సౌకర్యాలకు సంబంధించి పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథ్, జనరల్‌మేనేజర్ లాలూనాయక్, ఐపీవో మధుసూదన్, ఫుడ్ ప్రాసెసింగ్ అధికారి రచన విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ గులాం ముస్తాఫా, అధ్యాపకులు వినయ్‌కుమార్, శంకర్‌రావు, బాలరాజు, భగవాన్ పాల్గొన్నారు.

తూకం పేరిట మోసం



రాజంపేట: తూకంలో మోసాలకు పాల్పడుతున్న పత్తి వ్యాపారిని రైతులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాజంపేట మండలం ఆర్గొండ గ్రామంలో వ్యాపారులు పత్తి కొనుగోలు చేశారు. తూకం వేసే క్రమంలో బాట్లకు బదులుగా కోళ్ల దాణా సంచి ఉంచారు. అది 44 కిలోల బరువుందని పేర్కొన్నారు. పత్తిని తూకం వేస్తుండగా రైతులకు అనుమానం వచ్చి పరిశీలించారు. 44 కిలోలకు బదులు 64 కిలోలు తూకం వేస్తున్నట్లుగా తేలింది. దీంతో రైతులు వ్యాపారిని నిలదీయగా.. అతడు నిజాన్ని ఒప్పుకున్నాడు. రైతులు సదరు వ్యాపారికి పంటను అమ్మకుండా అక్కడినుంచి పంపించి వేశారు.

పసుపు రైతుకు స్వల్ప ఊరట

- క్వింటాలుకు రూ. 6 వేలకు పైగా లభిస్తున్న ధర



బాల్కొండ : పసుపు పంట సాగు చేసి మార్కెట్‌కు తరలించిన రైతుకు మంగళవారం మార్కెట్‌లో స్వల్పఊరట లభించింది. వారం రోజులుగా మార్కెట్‌లో కొమ్ముకు క్వింటాలుకు రూ. 6 వేలకు పైగా ధర పలుకుతుంది. దుంపలకు రూ. 5 వేల పైన ధర పలికింది. గతనెల క్రితం కూడా వారం రోజుల పాటు ఇలానే ధరను పెంచారు. మళ్లీ పసుపు ధరను భారీగా తగ్గించారు. గతేడాది చివరిలో క్వింటాలుకు 8,500 వరకు ధర గరిష్టంగా పలికింది.

జొన్న ధర..
జొన్న పంటకు ప్రారంభంలో క్వింటాలుకు రూ. 4,200 పెట్టి కొనుగోలు చేసిన వ్యాపారులు వారం రోజుల్లోనే క్వింటాలుకు రూ. 3,800కు తగ్గించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి చివరికి రూ. 3,400 ధరను తగ్గించారు. కాని రైతులు కొందరు విక్రయించేందుకు ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం మళ్లీ జొన్న ధరను పెంచుతున్నారు. బాల్కొండ నియోజక వర్గంలో ఓ గ్రామంలో క్వింటాలుకు రూ. 3,910 కొనుగోలు చేసేందుకు ఓ వ్యాపారి రైతులతో ఒప్పందం చేసుకున్నాడు. నిలకడలేమి కారణంగా జొన్నరైతు తీవ్రంగా నష్టపోతున్నాడు.

రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం

సుభాష్‌నగర్: నకిలీ పత్రాల కేసు రిమాండ్ రిపోర్ట్‌లో ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్ల పేర్లు పొందుపర్చడంతో రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం మొదలైంది. రిమాండ్ రిపోర్ట్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు సతీశ్, సురేశ్, వాసుకి పేర్లు ఉండడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు డాక్యుమెంట్ రైటర్లలోనూ జోరుగా చర్చ జరిగింది.

కాళేశ్వరంపై కరుణ ఏదీ?

- 22వ ప్యాకేజీ పనులకు నిధుల గ్రహణం
- ముందుకు సాగని భూ సేకరణ ప్రక్రియ
- ఏళ్లు గడుస్తున్నా పురోగతి కరువు
- నేడు జిల్లాలో పర్యటించనున్న సీఎం కేసీఆర్
- ముఖ్యమంత్రి స్పందించాలని రైతుల వినతి



❖ ''పక్షం రోజుల్లో నిజాంసాగర్‌కు వస్తా. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులపై సమీక్ష నిర్వహిస్తా''
– 2021 జూన్ 20న కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాల ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్.
సీఎం ఈ ప్రకటన చేసి 20 నెలలు గడిచాయి. కేసీఆర్ జిల్లాకు రాకపోవడంతో సమీక్ష జరగలేదు. పనుల్లోనూ పురోగతి లేదు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 22వ ప్యాకేజీ పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లుగా తయారైంది. నిధులు లేకపోవడంతో భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో పురోగతి లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజల సాగునీటి కష్టాలు తీరడం లేదు. సీఎం కేసీఆర్ స్పందించి నిధులు కేటాయించి పనులు వేగంగా సాగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



సత్తనడకన సాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులు

సాక్షి, కామారెడ్డి: తెలంగాణలో సాగునీటి కష్టాలు తీర్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత–చేవెళ్ల పథకానికి శ్రీకారం చుట్టారు. దీనికోసం 2008 లో కామారెడ్డి జిల్లా కేంద్రంలోనే పునాదిరాయి వేశారు. అయితే వైఎస్సార్ మరణానంతరం జిల్లాలో 22వ ప్యాకేజీ పనులు నిలిచిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్.. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చి, రీ డిజైన్ చేసింది. రీ డిజైన్‌తో 22వ ప్యాకేజీలో అదనంగా విస్తీర్ణం చేరింది. అయితే పనులు మాత్రం ముందుకు సాగలేదు. నిధులు కేటాయించకపోవడంతో ఇప్పటికీ భూసేకరణ పూర్తి స్థాయిలో జరగలేదు.

రెండు నియోజకవర్గాలకు ప్రయోజనం..
జిల్లా పరిధిలో రెండు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు కాళేశ్వరం 22వ ప్యాకేజీ చేపట్టారు. కామారెడ్డి నియోజకవర్గంలోని కామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, రాజంపేట మండలాలతో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్, గాంధారి, లింగంపేట, తాడ్వాయి తదితర మండలాల్లో సాగునీటి సమస్య పరిష్కారానికి 22 వ ప్యాకేజీ ఉపయోగపడుతుంది. అయితే ఈ ప్యాకేజీ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అవసరమైన నిధులు విడుదల చేయకపోవడంతో భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. యాచారం వద్ద సొరంగం తవ్వకం పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. అవి కూడా నత్తనడకన సాగుతున్నాయి.

రైతన్న కలలు నెరవేరేనా?
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పనులు వేగంగా పూర్తై బీడువారిన భూములకు సాగునీరు అందినా.. కామారెడ్డి జిల్లా రైతుల ఆశలు మాత్రం నెరవేరడం లేదు. కామారెడ్డి ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు వర్షాధారంగా, భూగర్భ జలాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు కురిస్తేనే పంటలు పండుతాయి. కాళేశ్వరం ప్రాజెక్టు వస్తే తమ పొలాలకు సాగునీటి కష్టాలు తీరుతాయని రైతులు ఎన్నో ఆశలు పెంచుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా వారి ఆశలు ఫలించడం లేదు.

సీఎంపై ఆశలు..
కాళేశ్వరం ప్రాజెక్టు 22 ప్యాకేజీపై సీఎం కేసీఆర్ కరుణ చూపాలని రైతులు కోరుతున్నారు. బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ బుధవారం జిల్లాకు రానున్నారు. స్వామివారి దర్శనం అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమావేశమవుతారని భావిస్తున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష జరిపి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం కోరుతోంది. ఈ విషయమై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది. ప్రజాప్రతినిధులు సీఎంతో మాట్లాడి కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు నిధులు మంజూరు చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.

'కళాశాలలు ఉద్యోగ కల్పన వేదికలు కావాలి'



రాశి వనంలో మొక్కలు నాటుతున్న ఉన్నత విద్య శాఖ, ఐఎస్‌బీ బృందం

కామారెడ్డి అర్బన్: డిగ్రీ కళాశాలలు ఉపాధి, ఉద్యోగ కల్పన వేదికలుగా రూపొందాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ల బృంద సభ్యులు అభిప్రాయపడ్డారు. బృంద సభ్యులు డీటీ చారి, గరిమ మాలిక్, రీసెర్చ్ అసోసియేట్ శ్రినింజిత రాయ్ మంగళవారం కామారెడ్డి ఆర్ట్స్, సైన్స్ కళాశాలను సందర్శించారు. ఉన్నత విద్యలో మార్పులు, మూల్యాంకన విధానంలో సంస్కరణలపై అధ్యాపకులు, విద్యార్థులతో చర్చించారు. అనంతరం రాశి వనంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అకడమిక్, ఐక్యూఏసీ సమన్వయకర్తలు రాజ్‌కుమార్, రామకృష్ణ, అధ్యాపకులు రాణి, శంకర్, శివకుమార్, రామస్వామి, జ్యోత్స్న, సూపరింటెండెంట్ ఆంజనేయులు, మారుతి, గోవర్ధన్ పాల్గొన్నారు.

'సాందీపని' సందర్శన
కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలను రాష్ట్ర ఉన్నత విద్య, ఐఎస్‌బీ బృందం సందర్శించింది. విద్యా వ్యవస్థలో మార్పులపై విద్యార్థులు, లెక్చరర్ల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబా, అకడమిక్ కోఆర్డినేటర్ మనోజ్, పరీక్షల ఇన్‌చార్జి రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

సొసైటీలో యూరియా కొరత

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి సొసైటీలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. దీంతో రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ దుకాణం వద్ద గంటల తరబడి లైన్‌లో ఉండి యూరియా కొనుగోలు చేశారు. సొసైటీలలో యూరియా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన యూరియాను తెప్పించాలని అధికారులను కోరారు.

బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య



మాట్లాడుతున్న ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ సుహాసినిరెడ్డి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని లింగాపూర్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజా గోస –బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలో లేకున్నా బీజేపీ ప్రజల వైపు ఉందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న కొన్ని పథకాలు అందకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తేలు శ్రీను, కుంట లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, నరేందర్, దత్తేశ్వరి పాల్గొన్నారు.

కొండపైకి రెండోసారి..

- నేడు తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానానికి కేసీఆర్ రాక
- బ్రహ్మోత్సవాలలో పాల్గొననున్న సీఎం
- ఏర్పాట్లు చేసిన యంత్రాంగం



విద్యుత్ దీప కాంతుల్లో ఆలయం

సాక్షి, కామారెడ్డి: బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ బుధవారం జిల్లాకు రానున్నారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని తిమ్మాపూర్ గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి తెలంగాణ తిరుమల దేవస్థానంగా నామకరణం చేశారు. 2016 ఏప్రిల్ 2న నిర్వహించిన బ్రహ్మోత్సవాలలో సీఎం కేసీఆర్ తొలిసారిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆలయాభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేశారు. సొంతంగా రూ.పది లక్షలు అందించారు. తర్వాత స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విన్నపం మేరకు మరో రూ.13 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా రూ.23 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు జరిగాయి. అలాగే ఆలయంలో వివిధ వసతుల కల్పనకు దాతలు కూడా చేయూతనందించారు. ఎత్తైన గుట్టపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం గుట్టపైకి రోడ్డు వేశారు. గుట్టపైన భక్తులు విడిది చేయడానికి అవసరమైన సత్రాలు నిర్మించారు. ఆలయం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.

స్పీకర్ ఆహ్వానం మేరకు..
శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆహ్వానించారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 3 వరకు ఉత్సవాలు జరుగుతుండగా.. మార్చి 1న వస్తానని సీఎం పేర్కొన్నారు. దీంతో స్పీకర్ పోచారం ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వహణ, సీఎం పర్యటనపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అక్కడే మకాం వేసి నాలుగైదు రోజులుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆలయ ధర్మకర్తలుగా స్పీకర్ కుటుంబ సభ్యులు ఉత్సవాలను తమ భుజాలపై వేసుకుని నిర్వహిస్తున్నారు.

పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ..
సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ బి.శ్రీనివాస్‌రెడ్డి అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కొండపైన సీఎం కేసీఆర్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించేందుకుగాను సమావేశ ప్రాంగణాన్ని రూపొందించారు. సీఎం సమీక్షకు అవసరమైన నివేదికలను ఆయా శాఖల ఆధ్వర్యంలో రూపొందించి సిద్ధం చేశారు.

భారీ బందోబస్తు
కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇద్దరు ఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఇద్దరు అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 22 మంది ఎస్సైలు, 73 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, వెయ్యి మంది ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీలు, మఫ్టీ పార్టీలతో ఇప్పటికే బందోబస్తు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. జోన్ శ్రీ రాజన్న రేంజ్ డీఐజీ రమేష్ నాయుడు ఏర్పాట్లను పరిశీలించారని తెలిపారు.

సీఎం పర్యటన ఇలా..
తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా రానున్నారు. బుధవారం ఉదయం 9.50 గంటలకు బేగంపేటలోని ప్రగతి భవన్ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు బాన్సువాడ పట్టణంలోని అంగడిబజార్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల ఆలయానికి వెళ్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న అనంతరం అక్కడే అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నారు. 1.25 గంటల వరకు బాన్సువాడలోని హెలిప్యాడ్ చేరుకుంటారు. 1.30 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీలతో చర్చిస్తున్న స్పీకర్

బాన్సువాడ టౌన్: బాన్సువాడ నియోజకవర్గానికి బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ రానుండడంతో ఏర్పాట్లపై అధికారులు సమీక్షించారు. మంగళవారం సాయంత్రం తిమ్మాపూర్‌లోని ఆలయం వద్ద స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో డీఐజీ రమేష్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పీకర్ అధికారులకు సూచించారు.

అవినీతి అధికారిపై ఫిర్యాదు చేస్తాం

- అన్ని ఆధారాలను ఉన్నతాధికారులకు అందిస్తాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన



సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, రియల్టర్లు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ అవినీతిపై సీఎం కేసీఆర్‌కు ఫిర్యాదు చేస్తానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం పాత రాజంపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిపై 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం తనకు తెలిసిన వ్యక్తినుంచి రూ. 15 వేలు వసూలు చేశారని ఆరోపించారు. వీఎల్‌టీ కోసం రూ. 5 వేలు, డాక్యుమెంట్‌లో అక్షరం తప్పు ఉన్నా రూ. 5 వేలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. డాక్యుమెంట్ రైటర్‌లనూ వేధిస్తూ పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇలా వసూలు చేసిన లక్షలాది రూపాయలను నిత్యం ఓ కారులో హైదరాబాద్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. సబ్ రిజిస్ట్రార్ అవినీతిని భరించలేక రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళనలకు సిద్ధమయ్యారన్నారు. తాను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తున్నానని సమాచారం ఇవ్వడంతో ఈ రోజు రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదన్నారు. రిజిస్ట్రేషన్లు చేస్తే అవినీతి బయటపడుతుందని రిజిస్ట్రేషన్లు ఆపివేశారన్నారు. సబ్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు చేసినా డీఆర్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అన్ని ఆధారాలతో హైదరాబాద్‌లోని అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

మున్సిపల్ బడ్జెట్ సమావేశాల రోజు పార్టీలకు అతీతంగా 49 మంది కౌన్సిలర్లు వీఎల్‌టీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టర్ స్పందించి, సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. రిజిస్ట్రేషన్ల కోసం ఎవరైనా డబ్బులు అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నిరసనల్లో పాల్గొనండి..
పెండింగ్‌లో ఉన్న డాక్యుమెంట్లను బుధ, గురు వారాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డాక్యుమెంట్ రైటర్లకు ముజీబొద్దీన్ సూచించారు. శుక్రవారం నుంచి 8 రోజుల పాటు డాక్యుమెంట్లు చేయవద్దని, సబ్ రిజిస్ట్రార్‌కు డాక్యుమెంట్లు సమర్పించకుండా తమతో నిరసనలో పాల్గొనాలని కోరారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ శ్రీలత వద్దకు వెళ్లి మాట్లాడారు. ''సబ్‌రిజిస్ట్రార్ గారూ.. మీ అవినీతి సేవలు ఇక చాలు. మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోండి'' అని రెండు చేతులు జోడించి వేడుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌గుప్తా, భూమేష్‌యాదవ్, లక్ష్మీపతియాదవ్, వంశీ తదితరులు ఉన్నారు. కాగా అధికార పార్టీ నాయకులు సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు చేస్తూ ఆందోళన చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు..



మాట్లాడుతున్న శ్రీలత

కామారెడ్డి టౌన్: నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌లు చేయనని చెప్పినందుకే తనపై కక్ష కట్టి అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం ఫీజులు వసూలు చేస్తున్నామన్నారు. వీఎల్‌టీ చార్జీలు మున్సిపల్ అధికారులు మాత్రమే వసూలు చేస్తారన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు చేయాలని కొంతమంది తనపై ఒత్తిడి తీసుకువచ్చి ఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడిగా గౌతం ప్రసాద్



బోధన్: మండలంలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన నింబూరి గౌతం ప్రసాద్ వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా.. మంగళవారం ఆయన తెలిపారు. ప్రస్తుతం గౌతంప్రసాద్ పార్టీ బోధన్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా కొనసాగుతున్నాడు. ఆయన నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



ఖలీల్‌వాడి: అర్బన్ నియోజకవర్గంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ అర్బన్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బుస్సాపూర్ శంకర్ పేర్కొన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఆయన నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి డివిజన్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు పోరాడాలన్నారు. ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్ మహమ్మద్, బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు హనుమయ్యా, నగర పార్టీ అధ్యక్షులు కస్తూరి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన పరీక్షలకు 83 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యా శాఖ అధికారి రఘురాజ్ తెలిపారు. ఉదయం పరీక్షకు జనరల్ విద్యార్థులు 1108మందికి గాను 1077మంది హాజరయ్యారు. ఒకేషనల్ 374 మంది విద్యార్థులకు గాను 349 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్ 619మంది విద్యార్థులకు గాను 604 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 328మంది విద్యార్థులకు 316మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్న య్య, కనకమహాలక్ష్మి, హైపవర్ కమిటీ సభ్యులు రాజీయుదిన్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కూడా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

ధర్పల్లి: మండలంలోని దమన్నపేట్, దుబ్బాక్, ధర్పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ప్రైమరీ పరీక్షలను పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం మన ఊరు మనబడి కింద కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు సావిత్రి, శ్రీనివాస్ ఉన్నారు.

'4న ఇంటర్ విద్యార్థులకు పరీక్ష'

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 4న 'నైతికత – మానవ విలువలు', 6న 'పర్యావరణ విద్య' పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదివరకే జవాబు పత్రాలను అన్ని పరీక్ష కేంద్రాలకు పంపించామని, ప్రశ్నాపత్రం అదేరోజు నెట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు అందించామన్నారు. విద్యార్థులు విధిగా రెండు పరీక్షలు రాయాలన్నారు. జిల్లాలోని 116 పరీక్ష కేంద్రాలలో మొత్తం 17,503 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

గ్రంథాలయాలపై పట్టింపేది?

- గ్రంథపాలకులను నియమించని రాష్ట్ర ప్రభుత్వం
- సిబ్బంది కొరతతో మూతపడుతున్న వైనం



అచ్చంపేటలో మూతపడిన గ్రామీణ గ్రంథాలయం



నిజాంసాగర్‌లో తాళం వేసి ఉన్న శాఖ గ్రంథాలయం

నిజాంసాగర్(జుక్కల్): ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న నిరుద్యోగ యువతకు జ్ఞానోదాయన్ని కల్గించే విజ్ఞాన బండారాలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. జిల్లాలో గ్రంథపాలకులతో పాటు సిబ్బంది కొరత కారణంగా గ్రామీణ గ్రంథాలయాలు మూత పడుతున్నాయి. దీంతో గ్రంథ పఠనానికి అలవాటు పడిన మేధావులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ఇద్దరే గ్రంథపాలకులు..

జిల్లాలో సెంట్రల్ గ్రంథాలయంతో పాటు 18 శాఖ గ్రంథాలయాలు, 7గ్రామీణ గ్రంథాలయాలు ఉన్నాయి. కానీ జిల్లా వ్యాప్తంగా ఇద్దరు గ్రంథపాలకులు మాత్రమే ఉండటంతో వారి పర్యవేక్షణ కరువైంది. చాలా చోట్ల శాఖ గ్రంథాలయాలు రోజుల తరబడి మూసి ఉంటున్నాయి. అలాగే గ్రామీణ గ్రంథాలయాల్లో సిబ్బంది కొరతతో మూత పడుతున్నాయి. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామ గ్రామీణ రెండేళ్ల నుంచి మూతపడింది. దీంతో గ్రామంలోని నిరుద్యోగులు పుస్తక పఠనానికి దూరం అయ్యారు. ఇలా జిల్లా వ్యాప్తంగా గ్రంథ పాలకులు, పార్ట్‌టైం ఉద్యోగులు, వాచ్‌మెన్ల కొరతతో గ్రంథాలయాలు మూతపడుతున్నాయి.

ఖాళీలు ఇవే..

జిల్లాలో గ్రేడ్–2 లైబ్రేరియన్ రెండు పోస్టులకు గాను రెండూ ఖాళీగా ఉన్నాయి. అలాగే గ్రేడ్–3 లైబ్రేరియన్ 11 పోస్టులకు గాను 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు వాచ్‌మెన్లకు గాను ఇద్దరు వాచ్‌మెన్లు ఉన్నారు. అలాగే పార్ట్‌టైం వర్కర్లు 19 మందికి గాను ప్రస్తుతం 11మంది పని చేస్తున్నారు. దీంతో శాఖ గ్రంథాలయాలు సమయపాలన పాటించకపోవడం, గ్రామీణ గ్రంథాలయాలు అయితే మూతపడుతున్నాయి.

ప్రస్తుతం పోటీపరీక్షల కాలం..

జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గ్రంథాలయంతోపాటు శాఖ గ్రంథాలయాల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్‌తో పాటు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలకు సంబందించిన అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ పలు గ్రంథాలయాల్లో గ్రంథపాలకులు లేకపోవడం, శాఖ గ్రంథాలయాలు సమయపాలన పాటించకపోవడంతో నిరుద్యోగులు పుస్తక పఠనానికి దూరం అవుతున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రంథాలయాలు తెరచి ఉంచకపోవడంతో నిరుద్యోగ యువత ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రంథాలయాల్లోని ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి..

ప్రతీరోజు గ్రంథాలయానికి వెళ్లి వార్త పత్రికలను చదువుతాను. గ్రంథాలయానికి అరగంట నుంచి గంటసేపు టైం కేటాయిస్తున్నాను. కానీ గ్రంథపాలకులు లేకపోవడంతో గ్రంథాలయాలు సమయపాలన పాటించడం లేదు. పార్ట్‌టైం సిబ్బందికి వేతనాలు సక్రమంగా రాకపోవడంతో గ్రంథాలయాలు తెరువడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

– ఏసయ్య, రిటైర్డ్ కంట్రోలర్, నిజాంసాగర్

నదిలో నాణేల వేట





రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నదిలో ఆనవాయితీగా భక్తులు చిల్లర డబ్బులు వేస్తుంటారు. దీంతో కొందరు స్థానికులు తాళ్లకు అయస్కాంతాలను కట్టి, నదిలో అటూ ఇటూ తిరుగుతూ నాణేల కోసం వెతుకుతున్నారు. అయస్కాంతానికి వచ్చిన చిల్లర డబ్బులు వారికి ఆర్థికంగా కొంత ఆసరగా ఉంటుందని అక్కడున్న వారు తెలిపారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి





వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వీవీ హరగోపాల్.. హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వీవీ హరగోపాల్ సూచించారు. తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం అప్లయిడ్ స్టాటిస్టిక్స్ (సాంఖ్యాక శాస్త్రం) విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని 'విజ్ఞాన శాస్త్రంలో సాంఖ్యక శాస్త్ర అనువర్తితం' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో హరగోపాల్ ప్రధాన వక్తగా హాజరై, మాట్లాడారు. టిక్సువల్ అనాలసిస్‌ను ఉపయోగించి 'డాటా' విశ్లేషణ చేయడంలో మెళకువలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రెండో సెషన్‌లో సీఈఎస్ఎస్ (సెస్) ప్రొఫెసర్ రవి మాట్లాడుతూ.. 'సంప్లింగ్ పద్ధతులు, నూతన ఆవిష్కరణలు' అంశాలపై వివరించారు. వర్క్‌షాప్‌లో తెయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ఆరతి, సైన్స్ డీన్ ప్రొఫెసర్ అరుణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం కట్టడం సారూ..?



నాలాలో మధ్యలో నిర్మిస్తున్న ప్రహరీ

- బాల్కొండ పాఠశాలకు ప్రహరీ నిర్మాణం
- బడి పక్కనున్న నాలాలో నిర్మిస్తున్న వైనం
- వరద నీరు వెళ్లేదెట్లంటున్న స్థానికులు

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం ఇష్టారీతిన నిర్మిస్తున్నారు. బడి పక్కన ఉన్న నాలాను ఆక్రమించి నాలాలో సగం వరకు ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ఇదేం కట్టడం సారూ! అంటు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు ప్రయివేటు వ్యక్తులే భూకబ్జాలకు పాల్పడి నిర్మాణాలు నిర్మించిన ఘటనలు కోకొల్లలున్నాయి. కానీ ప్రస్తుతం ప్రభుత్వ నిర్మాణాలు కూడా నాలాను మూసి వేస్తు నిర్మించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరద ప్రవాహానికి ఆటంకం..

కొండ ప్రాంతాల నుంచి వర్షపు నీరు ప్రవహించుటకు గతంలో నాలా నిర్మించారు. పాఠశాలకు ఇదివరకు ఉన్న ప్రహరీని నాలా వరకు నిర్మించారు. ప్రస్తుతం పాఠశాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా నూతన ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈక్రమంలో నూతన ప్రహరీని నాలా వరకు కాకుండా, నాలాలో సగం వరకు నిర్మిస్తున్నారు. దీంతో ఈ ప్రహరీ దేనికోసమో అర్థం కావడం లేదు. ఒకవేళ ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వస్తే ప్రహరీ నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే రూ.లక్షల ప్రజాధనం వరదపాలు కావాల్సిందే. ఇది వరకే షఫీల్ కట్టను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారనే విమర్శలు వినవస్తున్నాయి. గత వర్ష కాలంలో బాల్కొండ గ్రామం చెరువును తలపించేలా నీరు నిలిచింది. దీంతో హుటాహుటిన అధికారులు జేసీబీలో నాలాల్లో పూడికను తొలగించారు. ప్రస్తుతం నాలాకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నారు.అధికారులను సంప్రదించగా తమకేమి తెలియదు అంటు మాట దాటవేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాలాకు అడ్డుగా నిర్మిస్తున నిర్మాణం వెనుక కథను తేల్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

'కంటి వెలుగు ఖర్చు'లో కక్కుర్తి

- భోజనం డబ్బులు నొక్కేస్తున్న అధికారులు!
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



కంటి వెలుగు శిబిరం (ఫైల్)

నిజామాబాద్ సిటీ: కంటి వెలుగు శిబిరాల సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే డబ్బులలో కొంతమంది మెడికల్ ఆఫీసర్లు కక్కుర్తి పడుతున్నారు. జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు గత డిసెంబర్ 19న ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 70 కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేయగా ఒక్కో బృందంలో మెడికల్ ఆఫీసర్ 1, అప్తామెలోజిస్ట్ 1, డాటా ఎంట్రీఆపరేటర్1, ఏఎన్ఎం 1, సూపర్‌వైజర్ 1, ఆశవర్కర్లు 2 మొత్తం 8 మంది ఉన్నారు. వీరికి ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం చాయ్ కోసం ప్రభుత్వం నిత్యం రూ. 1500లు ఇస్తోంది. ఈ డబ్బులను ప్రభుత్వం మెడికల్ ఆఫీసర్ల ఖాతాలో వేస్తే, మెడికల్ ఆఫీసర్లు డ్రా చేసి సిబ్బందికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇందులో కొంతమంది మెడికల్ ఆఫీసర్లు భోజనం ఖర్చులకు ఇచ్చే డబ్బులలో కక్కుర్తి పడుతూ రూ. 1000 మాత్రమే సిబ్బందికి అందిస్తూ, రూ. 500 తమ జేబులో వేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డబ్బులు సిబ్బందికి సరిపోక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిగురించి అడిగితే మెడికల్ ఆఫీసర్లు నుంచి ఏమైనా ఇబ్బందులు వస్తాయోనని సిబ్బంది భయపడుతూ వారు ఇచ్చిందే తీసుకుంటూ సర్దుకుపోతున్నారు.

కొన్నిచోట్ల మొత్తం డబ్బులు ఆఫీసర్లకే..

కొన్ని గ్రామాలలో ప్రజాప్రతినిధులే కంటి వెలుగు శిబిరాల సిబ్బందికి నిత్యం భోజన సదుపాయం కల్పిస్తున్నారు. సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్థానిక ప్రజాప్రతినిధులే అన్ని వసతులు కల్పిస్తున్నారు. దీంతో సిబ్బందికి ఇవ్వవలసిన డబ్బులు మొత్తం ఆయా మెడికల్ ఆఫీసర్లే తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కంటి వెలుగు శిబిరం కార్యక్రమం మొత్తం 100 రోజులపాటు కొనసాగుతుండటంతో డబ్బులకు కక్కుర్తి పడుతున్న మెడికల్ ఆఫీసర్ల తీరుపై కంటి వెలుగు శిబిరం సిబ్బంది లోలోపల మదనపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తమకు సక్రమంగా డబ్బులు ఇప్పించాలని సిబ్బంది కోరుతున్నారు.

విచారణ చేయిస్తాం..

కంటి వెలుగు శిబిరాల సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే భోజనం ఖర్చుల డబ్బులలో అవినీతికి పాల్పడుతున్న మెడికల్ ఆఫీసర్లపై తగు విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. అలాంటిది ఇప్పటివరకు మా దృష్టికి రాలేదు. ఏ సిబ్బంది కూడా ఈ విషయంలో ఫిర్యాదు చేయలేదు.

– సుదర్శనం, జిల్లా ఆరోగ్యశాఖాధికారి, నిజామాబాద్

కిరాయి పేరుతో కార్ల తాకట్టు

ఖలీల్‌వాడి: కార్లను నెలవారి కిరాయి పేరిట అగ్రిమెంట్లు చేసుకొని తాకట్టు పెట్టిన ఘటన నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని కోటగల్లికి చెందిన రాజేష్ దాదాపు 25 కార్లను నెలసరి కిరాయిల పేరిట ఒప్పందం కుదుర్చుకొని, భద్రాది కొత్తగూడెం జిల్లాలో వివిధ శాఖల అధికారులకు రెంట్‌కు ఇస్తానని కారు ఓనర్లతో అగ్రిమెంటు చేసుకున్నారు. అయితే ఈ కార్లను తీసుకెళ్లిన రాజేష్ అక్కడ ఉన్న కొంతమంది ఉద్యోగులకు, యువకులకు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. నగరంలోని ఒక కారు ఓనర్‌కు రాజేష్ డబ్బులు చెల్లించకపోవడంతో కారు విషయమై పలుమార్లు అడిగినట్లు తెలిసింది. అయితే డబ్బుల విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన సదరు ఓనర్ ఆ కారుకు ఏర్పాటు చేసిన జీపీఎస్‌తో కొత్తగూడెంలో ఉన్నట్లు గుర్తించి మూడో టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కొత్తగూడెం వెళ్లి కారుతో పాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నగరంతోపాటు ఇందల్వాయి, తదితర ప్రాంతాల్లో కార్లను కిరాయికి తీసుకొని కొత్తగూడెంలో రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు తీసుకొని కార్లను తాకట్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు కొన్ని కార్లను కొత్తగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రాజేష్ కోసం మూడో టౌన్ పోలీసులు గాలిస్తున్నారు. రాజేష్‌కు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పైరవీ ఉంటేనే రుణాలు!

- మైనార్టీ రాయితీ రుణాలలో అధికారుల నిర్వాకం
- ఇంటర్వ్యూలు నామమాత్రమేనంటున్న దరఖాస్తుదారులు



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు అన్వర్. మోర్తాడ్‌లో బేకరీ షాపును నిర్వహిస్తున్నాడు. తన దుకాణాన్ని ఇంకా వృద్ధి చేయడానికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై ఇచ్చే రుణం ఉపయోగపడుతుందని ఆశించి, రుణం కోసం దరఖాస్తు చేశాడు. ఈక్రమంలో ఇటీవల లబ్ధిదారుల ఎంపిక కోసం మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కానీ లబ్ధిదారుల ఎంపిక జాబితాలో అన్వర్ పేరు లేదు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలు చోటుచేసుకున్నాయని తెలుస్తోంది. ఇది ఒక్క మోర్తాడ్‌లోనే కాదు జిల్లాలో అనేక చోట్ల ఇలానే జరుగుతోంది.

మోర్తాడ్(బాల్కొండ): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి, వ్యాపార వృద్ధి కోసం యువతకు రాయితీపై రుణాలు అందిస్తోంది. కానీ అర్హులకు దక్కాల్సిన రాయితీ రుణాలు పక్కదారి పడుతున్నాయి. సంబంధిత అధికారులు పైరవీ చేసిన వారికే రుణాలను మంజూరు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు సూచించిన వారికే రుణాల పంపిణీ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. పైరవీ చేసిన వారికే రుణం ఇచ్చినప్పుడు ఇంటర్వ్యూలు ఎందుకని అనేక మంది ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో 324 యూనిట్లు..

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలను అందించడానికి జనవరిలో నోటిఫికేషన్‌ను జారీ చేశారు. జిల్లాలో 324 యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికార యంత్రాంగం నిర్దేశించింది. చాలా కాలం తరువాత రాయితీ రుణాల పంపిణీ కోసం నోటిఫికేషన్ జారీ కావడంతో అనేక మంది రుణాల కోసం దరఖాస్తులు అందించారు. జిల్లా వ్యాప్తంగా 13,105 దరఖాస్తులు అందాయి. ఒక్కో యూనిట్‌కు 50మంది నుంచి వంద మంది పోటీ పడ్డారు. ఇంటర్వ్యూలను ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు నిర్వహించినా.. ఎంపిక చేయాల్సిన లబ్ధిదారులను మాత్రం అధికార పార్టీ నాయకులు సూచించారని ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ నాయకుల జోక్యం మితిమీరడం వల్ల ఇంటర్వ్యూల నిర్వహణ నామమాత్రంగానే సాగిందని తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు సూచించిన వారికి రుణం ఇచ్చినప్పుడు దరఖాస్తుల స్వీకరణ, ఇంటర్వ్యూలను నిర్వహించి కాలయాపన చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూనిట్ల సంఖ్యను పెంచినా కొంతమంది అర్హులైనవారికి న్యాయం జరిగేదనే అభిప్రాయం వ్యక్తమైతుంది.

అర్హులకు అన్యాయం..



మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం వల్ల అర్హులైన వారికి అన్యాయం జరిగి ఉండొచ్చు. యూనిట్ల సంఖ్యను పెంచి ఉంటే ఎక్కువ మందికి లబ్ధి జరిగేది. అర్హులకు రు ణాలు అందకపోవడం సరైంది కాదు. అధికారులు దీనికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

– అజారొద్దీన్, తిమ్మాపూర్

క్రైం కార్నర్

చెరుకు తోట దగ్ధం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో మాకం సాయిలు అనే రైతుకు చెందిన చెరుకు తోట మంగళవారం దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. చెరుకు తోట పైనుంచి కరెంటు వైర్లు వెళ్లడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల చెరుకు తోటకు నిప్పు అంటుకొని రెండు ఎకరాల వరకు దగ్ధమైనట్లు తెలిపారు. దగ్ధమైన చెరుకు తోట విలువ రూ. 2లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు చెరుకు తోటను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరుతున్నాడు.

విద్యుత్ చౌర్యం కేసులో రెండేళ్ల జైలు

ఖలీల్‌వాడి: కరెంట్‌ను అక్రమంగా వినియోగించుకొని విద్యుత్ చౌర్యానికి పాల్పడిన లకావత్ ప్రేమ్‌కు రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ రావు మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. సిరికొండ మండలంలోని ఒన్నాజీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దూల్ తండాకు చెందిన ప్రేమ్ తన ఇంటికి విద్యుత్ కార్యాలయం అనుమతి లేకుండా విద్యుత్‌ను వినియోగించాడు. దీంతో ఏఈ ధారావత్ కిషన్, లైన్‌మెన్ గోలి శ్రీనివాస్‌తో కలిసి డిసెంబర్ 30, 2016న స్థల పరిశీలన చేయగా.. విద్యుత్ చౌర్యం నిర్ధారణ అయింది. అధికారులు ఈమేరకు విద్యుత్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.5,918ల విద్యుత్ చౌర్యం జరిగినట్లు అధికారులు కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విద్యుత్ చౌర్యం చేసినట్లు నిర్ధారిస్తూ ప్రేమ్‌కు రెండు సంవత్సరాల జైలుశిక్ష తోపాటు రూ.35 వేల 508 జరిమానాను జడ్జి విధించారు. జరిమానా చెల్లించని యెడల అధనంగా ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

అదనపు కట్నం వేధింపులకు వివాహిత బలి



రెంజల్(బోధన్): పెళ్లి జరిగి పన్నెండు సంవత్సరాలు పూర్తయిన భర్త అదనపు కట్నం కోసం వేధించడంతో భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై పండ్ల సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన రజిత(24)ను పన్నెండేళ్ల క్రితం పెద్దలు వీరన్నగుట్టకు చెందిన భీమరాజ్‌తో వివాహం జరిపించారు. వివాహ సమయంలో పెద్దల సమక్షంలో వరుడికి కట్నకానుకలు అందించారు. కానీ ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత భర్త అదనపు కట్నం కోసం భార్యను వేధించసాగాడు. దీంతో గతంలో రెండు, మూడు సార్లు ఆమె ఆత్మహత్యకు యత్నించింది. పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా అతడు మారలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి వేధింపులు భరించలేక ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



మహేష్(ఫైల్)

కామారెడ్డి టౌన్: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామానికి చెందిన దుమాల మహేష్(27) సోమవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భూమిని కబ్జా చేశాడని, ధరణిలో తన పేరిట భూమి రాకుండా చేస్తున్నాడని మనస్తాపం చెంది విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు వెంటనే అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అయితే గ్రామానికి చెందిన సదరు వ్యక్తి నుంచి మహేష్ తల్లిదండ్రులు సాదాబైనామా ద్వారా 36 గుంటల భూమి కొనుగోలు చేశారన్నారు. కానీ ఆ భూమి ఇంకా అమ్మిన వ్యక్తి పేరునే ధరణిలో చూపిస్తుందన్నారు. మూడేళ్లుగా ధరణిలో తమ పేరిట మార్చాలని కోరినా చేయడం లేదని, దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసుకున్నారన్నారు. ఈవిషయమై దేవునిపల్లి పోలీసులను వివరణ కోరగా కుటుంబంలో గొడవల కారణంగా మహేష్ ఆత్మహత్యాయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసారని ఎస్సై తెలిపారు.

ప్రహరీ విషయంలో ఘర్షణ

- భిక్కనూరు మాజీ సర్పంచ్‌కు తీవ్రగాయాలు
- పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు



భిక్కనూరు: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఇంటి ప్రహరీ విషయంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలో భిక్కనూరు మాజీ సర్పంచ్ చంద్రపు సత్యనారాయణరెడ్డి (సత్యంరెడ్డి)కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి హై దరాబాద్‌కు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా బీఎ స్పీ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దబచ్చగారి శ్రీధర్‌రెడ్డి తమ ప్రహరీని కూల్చివేస్తుండగా.. పక్కింట్లో ఉన్న సత్యానారాయణరెడ్డితో వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు జ్ఞానప్రకాశ్‌రెడ్డితో పాటు మరో నలుగురు గుణపంతో పాటు, ఎడ్లబండి కాడితో సత్యంరెడ్డిపై దాడి చేయగా.. తీవ్రంగా గాయపడ్డారు. ఈమేరకు సత్యంరెడ్డి భార్య శోభాంజలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.